## సినీ జానపద గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత

సినీ నేపథ్య గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ సికింద్రాబాద్ చిలకలగూడ లోని ఆయన స్వగృహంలో గురువారం కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 'గబ్బర్ సింగ్' సినిమాలో 'పిల్లా నువ్వులేని జీవితం' పాటతో ఎంతో పేరు తెచ్చుకున్నాడు. అంతే కాకుండా 'కింగ్' సినిమాలో 'గింత గింత బాల చుక్కవే' అనే పాట పాడి అనేక మంది హృదయాలను గెలుచుకున్నాడు. వడ్డేపల్లి శ్రీనివాస్. అనేక జానపద గేయాలు, వేల స్టేజీ ప్రోగ్రాంలు చేసి నంది అవార్డుతో పాటూ ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయన వరంగల్ జిల్లాలో జన్మించారు. చిన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణలో గొప్ప జానపద కళాకారుడిగా పేరు తెచ్చుకున్నాడు. 'నమస్తే అన్న' చిత్రంలో సుద్దాల అశోక్ తేజ రాసిన 'గరం గరం పోరీ నా గజ్జెల సవ్వారీ' అనే పాట ద్వారా సినీ నేపథ్య గాయకుడిగా పరిచయయ్యాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్స్‌లలో ఆయన పాడిన జానపద గీతాలు విశేష ఆదరణ పొందాయి. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు సీతాఫల్‌మండి హిందూ శ్మశాన వాటికలో జరిగాయి. అంత్యక్రియలకు సంగీత దర్శకులు విష్ణు కిషోర్, జానపద కవి గాయకుడు నేర్నాల కిషోర్, గాయని స్వర్ణక్క ,గాయకుడు బోనాల ప్రకాష్ , కళాకారుడు సంపత్ , గాయకురాలు మల్లిక అనేకమంది కళాకారులు హాజరై సంతాపం తెలిపారు.




## తల్లి కాబోతున్న దీపిక



దీపికా పదుకోన్‌కు శుభాకాంక్షలు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. నెటిజన్లు, సెలబ్రిటీలు సోషల్‌మీడియాలో ఆమెకు కంగ్రాట్స్ చెబుతూ పోస్టులమీద పోస్టులు పెడుతున్నారు. ఎందుకీ శుభాకాంక్షలు? అనుకుంటున్నారా!. దీపిక తల్లి కాబోతున్నారు. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ రణబీర్, దీపికా కలిసి తమ ఇన్‌స్టా ద్వారా అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పేశారు. సెప్టెంబర్లో డెలివరీ డేట్ ఇచ్చినట్టు తన పోస్ట్‌లో పొందుపరిచారు దీపిక. 'మా ఇద్దరికీ పిల్లలంటే ప్రాణం. పిల్లలతో ఇల్లు కళకళలాడే రోజుకోసం ఎదురుచూస్తున్నాం' అని సంతోషం వ్యక్తం చేశారు దీపిక. ఇంకా చెబుతూ 'మా పిల్లల్ని సెలబ్రిటీ స్టేటస్‌కి దూరంగా పెంచాలని నిర్ణయించుకున్నాం. మా తల్లిదండ్రులు నన్నెంతో క్రమశిక్షణతో పెంచారు. రణబీర్ కూడా అలాంటి వాతావరణంలోనే పెరిగాడు. అందుకే.. మా పిల్లల్ని కూడా క్రమశిక్షణగా బాధ్యత గల భారతపౌరులుగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం' అంటూ చెప్పుకొచ్చారు దీపిక. ఇదిలావుంటే.. 'రామ్ లీల'(2013)లో తొలిసారి జతకట్టిన ఈ జంట.. ఆ సినిమా షూటింగ్‌లో ఉన్నప్పుడే ప్రేమలో పడ్డారు. 2018 నవంబర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు. ఇప్పటికే మంచి జంటగా అందరి మన్ననలనూ అందుకున్న ఈ జంట తల్లిదండ్రులు కావడం నిజంగా శుభవార్తే.

## అడవిని కాపాడే అమ్మోరిలా..



'పుష్ప' చిత్రం తెలుగు చిత్రసీమకు ప్రత్యేకం. 'బాహుబలి' సినిమాల తర్వాత తెలుగు సినిమా స్థాయిని పెంచిన సినిమా 'పుష్ప'. అటు అవార్డుల పరంగా, ఇటు రివార్డుల పరంగా తనదైన మార్క్‌ని చూపించిందీ సినిమా. తొలిసారి తెలుగుకి జాతీయ ఉత్తమనటుడు అవార్డును తెచ్చిపెట్టింది కూడా 'పుష్ప'నే. అంతేకాదు.. తెలుగు, కేరళ రాష్ట్రాల్లో మాత్రమే బలంగా ఉన్న బన్నీ ఇమేజ్‌ను బాలీవుడ్‌కి కూడా వ్యాపింపజేసిన సినిమా 'పుష్ప'. అందుకే.. దేశవ్యాప్తంగా సినీ అభిమానులందరూ 'పుష్ప–2' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పుష్ప–2'కు చెందిన ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి తెలియవచ్చింది. వివరాల్లోకెళ్తే.. ఈ సినిమా ఇంటర్వెల్ బ్యాంగ్ కోసం 25నిమిషాల నిడివిగల భారీ యాక్షన్ ఎపిసోడ్‌కి ప్లాన్ చేశారు దర్శకుడు సుకుమార్. ఈ ఎపిసోడ్ కోసం నిర్మాతలు కోట్లు ఖర్చుపెడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. కాగా, ఇందులో బన్నీ కేరక్టరైజేషన్ గురించి కూడా కొత్త విషయాలు తెలిశాయి. 'పుష్ప'కి పూర్తి భిన్నంగా ఇందులో పాత్ర ఉంటుందట. తొలిభాగంలో గంధపుచెక్కల దొంగలా కనిపించిన 'పుష్ప'.. రెండో భాగంలో అడవిని కాపాడే అమ్మవారిలా కనిపిస్తాడట. అమ్మవారి రూపంలో అడవిలో సంచరిస్తూ అడవిదొంగల భరతం పడుతుంటాడట. ఈ ఎపిసోడ్లన్నీ రోమాంచితంగా ఉంటాయని తెలుస్తున్నది. ఆగస్ట్ 15న 'పుష్ప–2' విడుదల కానున్న విషయం తెలిసిందే.



## రైతు కష్టాల 'సాగు'

వంశీ తుమ్మల, హారిక బల్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సాగు'. వినయ్‌రత్నం దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని డా||యశస్వి వంగా నిర్మించారు. నిహారిక కొణిదెల సమర్పకురాలిగా వ్యవహరించారు. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్‌తో పాటు వివిధ ఓటీటీ మాధ్యమాల్లో ఈ నెల 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'వ్యవసాయదారుల జీవితాల్లో ఆశలను నింపే కథాంశమిది. ఎలాంటి కష్టాలు వచ్చినా పట్టుదలతో ముందుకుసాగాలనే సందేశాన్నిస్తున్నాం. ఈ సినిమాలో రైతు కష్టాలను ఆవిష్కరించాం' అని చెప్పింది. సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదనే గొప్ప సందేశంతో ఈ సినిమాను తెరకెక్కించామని దర్శకుడు వినయ్ రత్నం తెలిపారు. సినిమాలో ఛాలెంజింగ్ రోల్ చేశానని హారిక బల్ల తెలిపింది.

## శ్రీవిష్ణు కొత్త చిత్రాలు



కెరీర్ ఆరంభం నుంచి వైవిధ్యమైన కథాంశాలను ఎంపిక చేసుకొని సినిమాలు చేస్తున్నారు యువ హీరో శ్రీవిష్ణు. ముఖ్యంగా ప్రేమకథా చిత్రాలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌లో తనదైన నటనతో మెప్పిస్తున్నారు. గురువారం శ్రీవిష్ణు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్త చిత్రాలను ప్రకటించారు. ఈ రెండు చిత్రాలను గీతా ఆర్ట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వంటి అగ్ర నిర్మాణ సంస్థలు తెరకెక్కిస్తుండటం విశేషం. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ నిర్మిస్తున్న చిత్రానికి 'నిను వీడని నీడను నేనే' ఫేమ్ కార్తీక్‌రాజు దర్శకత్వం వహించనున్నారు. విద్యా కొప్పినీడి, భానుప్రతాప, రియాజ్ చౌదరి నిర్మాతలు. శ్రీవిష్ణు నటిస్తున్న 18వ చిత్రమిది. చక్కటి ప్రేమకథతో వినోద ప్రధానంగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నామని మేకర్స్ తెలిపారు.

**కామెడీ ఎంటర్‌టైనర్ 'శ్వాగ్'**

శ్రీవిష్ణుతో 'రాజ రాజ చోర' వంటి హిట్ చిత్రాన్ని అందించాడు దర్శకుడు హసిత్ గోలి. వీరిద్దరి కాంబినేషన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ 'శ్వాగ్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. గురువారం టైటిల్‌ను ప్రకటించడంతో పాటు కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. ఆద్యంతం హాస్యప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్‌సాగర్, సహనిర్మాత: వివేక్ కూచిబొట్ల, రచన–దర్శకత్వం: హసిత్ గోలి.




## గామికోసం

'ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. అరుదైన కథతో తెరకెక్కించారు. ఆరేళ్లపాటు ఒక సినిమా కోసం అంకితభావంతో పనిచేయడం మామూలు విషయం కాదు' అని అన్నారు అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. గురువారం జరిగిన 'గామి' చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 8న విడుదలకానుంది. 'నేనెవరినో..అసలు ఎక్కడి నుంచి వచ్చానో..నాకీ సమస్య ఎప్పటి నుంచి ఉందో.. ఎంత ప్రయత్నించినా గుర్తుకు రావడం లేదు' అంటూ విశ్వక్‌సేన్ తనను తాను ప్రశ్నించుకునే సన్నివేశంతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలైంది. ఈ సినిమాలో మానవ స్పర్శను అనుభవించలేని అఘోర పాత్రలో విశ్వక్‌సేన్ నటిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ అనంతరం సందీప్‌రెడ్డి వంగా మాట్లాడుతూ.. 'ఈ సినిమా టెక్నికల్‌గా వండర్‌ఫుల్‌గా ఉంది. ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ అనుభూతినందిస్తుంది' అన్నారు. ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు తానెవరో ఎవరికీ తెలియదని, ఆరేళ్ల పాటు ఎంతగానో శ్రమించి ఈ సినిమా తీశామని, ప్రతి తెలుగు ఫిల్మ్‌మేకర్ గర్వంగా చెప్పుకునే సినిమా అవుతుందని విశ్వక్‌సేన్ అన్నారు. ఈ సినిమా విషయంలో సందీప్‌రెడ్డి వంగా ఎంతగానో సహకారం అందించారని దర్శకుడు విద్యాధర్ కాగిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## భారతీయ కథతో హాలీవుడ్ సినిమా..



హాలీవుడ్ కథలను భారతీయ భాషల్లో రీమేకులు చేయడం సర్వసాధారణం. కానీ తొలిసారి మన భారతీయకథలను హాలీవుడ్ రీమేక్ చేయబోతున్నది. ఇప్పటికే 'ఆర్‌ఆర్‌ఆర్'తో భారతీయ సినిమా ఆస్కార్ దాకా వెళ్లింది. ఇప్పుడు మన కథలు కూడా హాలీవుడ్‌లో రీమేక్ అవుతుండటం నిజంగా గర్వకారణం. వివరాల్లోకెళ్తే.. మలయాళంలో మోహన్‌లాల్, మీనా జంటగా నటించిన 'దృశ్యం' సినిమా ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ సినిమా కేరళలో రికార్డు కలెక్షన్లు సాధించి దేశాన్ని ఆకర్షించింది. అదే కథను అదే పేరుతో వెంకటేశ్, మీనా జంటగా తెలుగులో రీమేక్ చేస్తే ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. కన్నడలో 'దృశ్య' పేరుతో, తమిళంలో 'పాపనాశం'గా రూపొంది, విడుదలైన ప్రతి భాషలో విజయదుంధుభి మోగించిందీ కథ. ఈ కథకు కొనసాగింపైన 'దృశ్యం–2' కూడా సూపర్‌హిట్. భారతీయ భాషల్లో అమోఘ విజయాలను అందుకున్న ఈ కథలను కొరియన్‌లో రీమేక్ చేశారు. అక్కడ కూడా వీటిని విజయాలే వరించాయి. ఇప్పుడు ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ గల్ఫ్ స్ట్రీమ్ పిక్చర్స్, మరో నిర్మాణ ంస్థతో కలిసి ఈ కథలతో హాలీవుడ్ చిత్రాలను నిర్మించనుంది. ఇండియన్ సినిమా నిర్మాణ సంస్థ పనోరమ స్టూడియోస్ నుంచి ఈ కథల రీమేక్ హక్కులను సొంతం చేసుకుంది. ఇందులో నటించే నటీనటుల వివరాలు తెలియాల్సివుంది.

## తాంత్రిక విద్యల తంత్ర



రావణ కుమారుడైన ఇంద్రజిత్ నికుంబళాదేవి ఉపాసకుడు. అతడు నికుంబళాయాగం పూర్తిచేసి యుద్ధరంగంలోకి అడుగుపెడితే ఇక అతడ్ని ఓడించడం ఎవరి వల్లా కాదు. అందుకే నికుంబళాదేవికి పూజచేస్తున్న ఇంద్రజిత్‌పై వానరసైన్యంతో దాడిచేస్తాడు లక్ష్మణుడు. చాలామందికి తెలియని విషయం ఏంటంటే.. నికుంబళ దేవి ఓ క్షుద్రదేవత. ఇంద్రజిత్ తలపెట్టిన పూజ క్షుద్రపూజ.. అంటూ మీసాల తాంత్రిక పూజల గురించి లక్ష్మణ్ మీసాల చెప్పే ఎపిసోడ్‌తో 'తంత్ర' ట్రైలర్ మొదలైంది. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకుడు. నరేశ్‌బాబు.పి, రవి చైతన్య నిర్మాతలు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'తాంత్రిక విద్యల నేపథ్యంలో ఆసక్తికరమైన ఎలిమెంట్స్‌ని గ్రిప్పింగ్‌గా రూపొందించాం. ప్రొడక్షన్ వ్యాల్యూస్ చాలా బావుంటాయి' అని దర్శకుడు చెప్పారు. ఇప్పటివరకూ 'వకీల్‌సాబ్' అనన్య, 'మల్లేశం' అనన్య అని పిలిచిన మీరు, ఈ సినిమా తర్వాత 'తంత్ర' అనన్య అని పిలుస్తారని అనన్య నాగళ్ల అన్నారు. ఇందులో హారర్‌తోపాటు రొమాన్స్, సెంటిమెంట్ అన్నీ సమపాళ్లలో ఉంటాయని హీరో ధనుష్ రఘుముద్రి తెలిపారు. ఇంకా సంగీత దర్శకుడు ఆర్.ఆర్.ధృవన్ కూడా మాట్లాడారు.

## మునుపెన్నడూ చూడని మైథలాజిక్ థ్రిల్లర్ ఇది

'ఇది క్రైమ్ అండ్ డిటెక్టివ్ థ్రిల్లర్. ఈ తరహా జానర్ చేయాలనకున్నప్పుడు ఏదో యూనిక్ నెస్ వుంటే తప్ప చేయకూడదని అనుకున్నాను. 'భూతద్దం భాస్కర్‌నారాయణ' కథ విన్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. ఇందులోని మైథాలజీ ఎలిమెంట్ అందరినీ ఆకట్టుకుంటుంది. ఇలాంటి ఎలిమెంట్ గతంలో వచ్చి ఏ డిటెక్టీవ్ సినిమాలో లేదు.' అన్నారు శివ కందుకూరి. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'భూతద్దం భాస్కర్‌నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకుడు. స్నేహల్, శశిధర్, కార్తీక్ నిర్మాతలు. నేడు ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శివ కందుకూరి విలేకరులతో ముచ్చటించారు. 'డిటెక్టివ్ సినిమా అనగానే చంటబ్బాయి, ఏజెంట్ సాయిశ్రీనివాస్ ఆత్రేయ చిత్రాలు గుర్తొస్తాయి. ఈ సినిమా వాటికి భిన్నంగా ఉంటుంది. ఇళ్లముందు, పొలాల్లో దిష్టిబొమ్మలు మనం చూస్తుంటాం. అసలు వాటిని ఎందుకు పెడతారు? అనేదానిపై ఎవరికీ సరైన అవగాహన లేదు. దీనిపై పురాణాల్లో ఒక కథ వుంది. ఆ అంశాన్ని జోడించి కథను తయారు చేశాడు దర్శకుడు పురుషోత్తం రాజ్. ఆయనది అనంతపురం దగ్గర చిన్న పల్లెటూరు. ఆ ఊరు ప్రేరణగా తయారు చేసుకున్న కథ ఇది. కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల మధ్యవుండే ఫారెస్ట్ టౌన్ నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది' అని తెలిపారు. ఇందులో తన పేరు భాస్కర్‌నారాయణ అని, భూతద్దం సైజు కళ్లద్దాలు ఉంటాయని, దాంతో అందరూ భూతద్దం భాస్కర్‌నారాయణ అని పిలుస్తుంటారని, డిటెక్టివ్ కావడంతో ఆ కళ్లద్దాలు పెట్టుకొని భూతద్దం వాడుతుంటానని ఆయన తెలిపారు. సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుదని ఆయన అన్నారు.





## విమర్శలను పట్టించుకోను

నేటి సోషల్ మీడియా కాలంలో ప్రతి ఒక్కరికి అభిప్రాయాల్ని వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉందని, సెలబ్రిటీలపై వచ్చే పుకార్లపై స్పందించకుండా ఉండటమే మంచిదని చెప్పింది అగ్ర కథానాయిక తమన్నా. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ భామ మాట్లాడుతూ 'కొందరు విమర్శించడమే పనిగా పెట్టుకుంటారు. అలాంటి వారిని పట్టించుకోకపోవడమే బెటర్. ఏదైనా వార్తకు మనం అతిగా స్పందిస్తేనే అది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారుతుంది. అందుకే నేను నెగెటివిటీకీ దూరంగా పూర్తిగా వృత్తి మీదనే దృష్టిపెట్టాను. ప్రేక్షకులు అంతిమంగా మనం చేసిన పాత్రలను, విజయాలను మాత్రమే గుర్తుపెట్టుకుంటారు' అని చెప్పుకొచ్చింది. తనకు ఉత్తరాది, దక్షిణాది రెండు కళ్లలాంటివని..ఇప్పుడు రెండు చోట్లా మంచి అవకాశాలొస్తున్నాయని, అయితే సౌత్ సినిమాల ద్వారానే స్టార్‌డమ్‌ను సంపాదించుకున్నానని తమన్నా పేర్కొంది. ప్రస్తుతం ఈ భామ తమిళంలో 'అరాణ్మనై–4', హిందీలో 'వేద' 'స్త్రీ–2' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## ఎవరు చేసిన కర్మ వారి దగ్గరకే చేరుతుంది

'వెంకటాపురం బంగ్లా డీటెయిల్స్ కావాలి'.. 'ఆ బంగ్లా గురించి మీకు తెలుసా?'.. 'అది దెయ్యాల కొంప'.. ఇలా ముగ్గురు మాట్లాడుకుంటూ వుండగా 'వళరి' మూవీ ట్రైలర్ మొదలైంది. హారర్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ ట్రైలర్‌లో రితికా సింగ్ నటన బావుంది.. శ్రీరామ్ పాత్ర కీలకం అని తెలుస్తున్నది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు హరీశ్‌శంకర్ ట్రైలర్‌ని ఆవిష్కరించి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందిచారు. శ్రీరామ్, రితికా సింగ్ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి కె.సత్యసాయిబాబు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఎం.మృతిక సంతోషిణి దర్శకురాలు. ' 'వళరి' అనేది ఓ ఆయుధం. అది బూమరాంగ్‌లా పనిచేస్తుంది. మనం చేసే కర్మ తిరిగి అది మన దగ్గరకే వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో కథ సాగుతుంది. అందరికీ నచ్చే సినిమా ఇది' అని చెప్పారు దర్శకురాలు మృతిక సంతోషిణి.